సమాజ సేవను బాధ్యతగా తీసుకోవాలి



డాక్టర్ నీలా శ్రీధర్‌ను సత్కరిస్తున్న వాసవీ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

కాచిగూడ: సమాజ సేవకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుని పనిచేయాలని అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వాసవీ ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్ అన్నారు. వాసవీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల అశోక్ గుప్తా అధ్యక్షతన సోమవారం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రముఖులను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఎదుగుదలలో కీలకపాత్ర పోషించిన సమాజానికి సేవ చేయాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. తద్వారా సమాజంలో పేద ప్రజలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ నీలా శ్రీధర్, శ్రవణ్‌కుమార్, మారం సుదేశ్ కుమార్, అల్లాడి శ్రీనివాస్‌లను సన్మానించారు. ఎలకంటి పూర్ణచందర్ గుప్తా, కొండూరి నాగిశెట్టి గుప్తా, గౌరీశంకర్ తదితరులున్నారు.

బొగ్గు బావుల వేలాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి భాస్కర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బావుల వేలాన్ని రద్దు చేసి సింగరేణి శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌కు కేటాయించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే విడత బొగ్గుబావుల వేలాన్ని ప్రారంభించిందని విమర్శించారు. తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డికి గనుల శాఖను కేటాయించి హైదరాబాద్ నుంచే వేలం ప్రక్రియను ప్రారంభించడం విస్మయానికి గురిచేస్తుందన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ కూడా వేలం పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని బొగ్గు బావులను సింగరేణికి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ జనక్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బాలరాజ్, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి సూర్యం, శ్రీనివాస్, అనురాధా, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఎం.కె.బోస్, బీఆర్‌ఎస్‌కేవీ అధ్యక్షుడు రాంబాబుయాదవ్, హెచ్ఎంఎస్ నాయకులు రామారావు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు భూపాల్, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



స్థానికులతో ముఠా జైసింహ, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు

ముషీరాబాద్: ఎన్నికలకు ముందు శంకుస్థాపనలు చేసిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ యువజన కమిటీ సీనియర్ నాయకులు ముఠా జైసింహ అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని వెస్ట్ ఎంసీహెచ్ కాలనీ, జాంబవీనగర్, వినోభానగర్, మోహన్‌నగర్ ప్రాంతాల్లో స్థానికుల ఫిర్యాదు మేరకు జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాంబవీనగర్‌లో రోడ్డు నిర్మాణానికి టెండర్లను పూర్తిచేసి వెంటనే సీసీరోడ్డు వేయాలని కోరారు. పలు ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్ పెంచి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలన్నారు. పార్కు ప్రహరీని పెంచి పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని కోరారు. ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు శివ ముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ముషీరాబాద్ మహంకాళి దేవాలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, డివిజన్ నాయకులు శ్రీకాంత్ ముదిరాజ్, భాస్కర్‌నేత, పూసగోరక్‌నాథ్, జార్జ్, సత్యనారాయణబాబు, మహేష్, నర్సింగ్‌రావు తదితరులున్నారు.

ఉచిత శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: మహిళలు ఉచిత శిక్షణా కోర్సులను సద్వివినియోగం చేసుకోవాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ సూచించారు. సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ నివి చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్తాధ్వర్యంలో డివిజన్‌లోని వీవీగిరినగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మగ్గం వర్క్ శిక్షణా కేంద్రాన్ని లయన్స్‌క్లబ్ ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గంపా నాగేశ్వర్‌రావు బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్‌తో కలసి ఆమె ముఖ్యఅతిథిగా ప్రారంభించి మాట్లాడారు. గంపా నాగేశ్వర్‌రావు మహిళాలు ఆర్థికంగా రాణించేదుంకు ఉచిత శిక్షణాకేంద్రాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మగ్గం వర్కర్‌తో పాటు త్వరలో బ్యూటిషియన్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణని చ్చేందుకు కారొపరేటర్‌తో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రీజినల్ చైర్మన్ జీవీఎశ్ రామయ్యనాయుడు, ప్రముఖులు సెరిపల్లి జేష్, మొర్రం సుబ్రహ్మణ్యం, చంద్రమోహన్, ప్రకాష్, కమలాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

హిమాయత్‌నగర్: తెలంగాణ పర్యాటక శాఖలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి కోరారు. ఈ మేరకు టూరిజం శాఖ ఎండీగా బాధ్యతలు చేపట్టిన ఎస్.ప్రకాశ్‌రెడ్డిని హైదర్‌గూడలోని కార్యాలయంలో సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. 25 ఏళ్లుగా పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేసి, వారి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి

లిబర్టీ: మున్సిపల్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని మున్సిపల్ లేబర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రీతంసింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు చెల్లించాలన్నారు. ప్రతి నెల 1వ తేదీన చెల్లించేలా సీఎం రేవంత్‌రెడ్డి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కొలకలూరి ఇనాక్ సాహిత్యం ప్రభుత్వాలకు దిశానిర్దేశం..



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్, మధుజ్యోతి

చిక్కడపల్లి: ఇనాక్ తన కథల్లో యోగ్యతా పత్రాలలో తండ్రి పేరుతో పాటు తల్లి పేరును పేర్కొనాలని, ఓటుహక్కు దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్దే ఉపయోగించుకోవాలనే వంటి అంశాలు ఏళ్ల క్రితమే రాశారని, అవి కొన్ని ప్రభుత్వాలు అమలు చేశాయని ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి అన్నారు. బాల కార్మిక వ్యవస్థపై మెదడు వాపు వ్యాధి వంటి కథలు ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేస్తాయని ఆమె చెప్పారు. సోమవారం సాయంత్రం శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ కొలకలూరి ఇనాక్ కథానికా సాహిత్యంపై ఆమె మాట్లాడుతూ.. ఆయన కథా సాహిత్యం సమస్తం వాదాలు కాకుండా అనుభవాల సారం సామాజిక దృష్టి అని వివరించారు. మూర్తి దేవి పురస్కారం అందుకున్న ఏకైక తెలుగు రచయిత ఇనాక్ సాహిత్యం ఒక్క ప్రక్రియకు పరిమితం కాలేదని నాటక రచయిత డాక్టర్ విజయభాస్కర్ అన్నారు. ఆయన రాసిన పూరబావి కథలు, వలస కథ సమాజాన్ని ఆలోచింపజేస్తాయన్నారు. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ.. తన సాహిత్యం మానవీయ విలువలు నైతిక ప్రవర్తన నేపథ్యంలో ఉంటాయని వివరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన సభలో ఆచార్య రాములు ఉన్నారు. అనంతరం ప్రముఖ నాట్యగురువు తులసి శిష్య బృందం కూచిపూడి నాట్య అంశాలు కనుల పండువగా ప్రదర్శించి సభికులను అకట్టుకున్నారు.

సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీవేత్త కొలకలూరి ఇనాక్ అని సీనియర్ పాత్రికేయులు, సినీ నిర్మాత కంఠంనేని రవిశంకర్ అన్నారు. సోమవారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలో పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మహర్షి వాల్మీకి సంస్కృతిక సేవా సంస్థ, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కంఠంనేని రవిశంకర్ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యాన్ని డిజిటల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తూ.. తెలుగు భాషా సాహిత్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ప్రముఖ కవి డాక్టర్ బిక్కి కృష్ణ, డీ.వీ.రాజగోపాల్, డాక్టర్ విద్యాధర్, శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ భారతీ, డాక్టర్ రాధాకుసుమ, ద్రావిడ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మధుజ్యోతి, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



కేక్‌కట్ చేస్తున్న ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్



ముషీరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ దీప్తి ప్రియాంక



కాచిగూడ: సమాజంలో వైద్యుల పాత్ర కీలకమైందని, వైద్యరంగాన్ని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని సాయికృష్ణ న్యూరో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.రాంరెడ్డి అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సోమవారం కాచిగూడలోని సాయిక్రిష్ణ సూపర్ స్పెషాలిటీ న్యూరో హాస్పిటల్‌లో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వైద్యులతో కలిసి కేక్ కట్‌చేయించి వైద్యసిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్యులను ఘనంగా సత్కరించారు. డాక్టర్ ఆర్.శ్రీనివాస్ రెడ్డి, ప్రొ.డాక్టర్లు శ్రీనివాస్, పీజీ.రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి తదితరులున్నారు.

నల్లకుంట: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎంహెచ్ ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ ఆధ్వర్యంలో సోమవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి జాతీయ డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. శంకర్, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ జయలక్ష్మి, డీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ చంద్రశేఖర్, సివిల్ సర్జన్ డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ చక్రవాణి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మోహన్‌దాస్‌లతో కలిసి కేక్ కట్ చేయించి వైద్యులకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. టీఎంహెచ్‌ఈయూ ఫీవర్ ఆసుపత్రి శాఖ అధ్యక్షురాలు కె. లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు జనార్దన్, పద్మజ, అమిత వర్మ, సత్యనారాయణ, రాఘవేందర్ తదితరులున్నారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు..

ముషీరాబాద్: ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించవద్దని చిన్నపాటి ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే నిష్ణాతులైన డాక్టర్లను సంప్రదించాలని పలువురు డాక్టర్లు సూచించారు. యామ్వీ క్లినిక్‌లో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం ఆసుపత్రి ఎండీ సందీప్ అధ్యక్షతన జరిగింది. డాక్టర్ అందె సౌమ్య, గైనకాలజిస్ట్ డాక్టర్ పూజా సాహూ, డాక్టర్ స్వాతి, డెంటల్ సర్జన్ డాక్టర్ ఎన్.సౌమ్య తదితరులు ఆయా రంగాలపై మాట్లాడారు.

డాక్టర్ శేఖర్‌రెడ్డికి సన్మానం..

జాతీయ డాక్టర్స్ డేను పురస్కరించుకుని భోలక్‌పూర్‌లో ప్రముఖ డాక్టర్ శేఖర్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు నియాజ్, ఇర్ఫాన్, సబ్దర్ అలీ, జావేద్ అలీ తదితరులున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో...

వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంకా ఆసుపత్రి సిబ్బందితో కలిసి డాక్టర్స్ డే కేక్‌ను కట్ చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ.. వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ.. వారి ఆరోగ్యాల పరిరక్షణకు కృషి చేస్తున్నారన్నారు. ఆసుపత్రి పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు విజయకుమారి, సునిత, పద్మ, రత్నమాల ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పరామర్శ



తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేత వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల శ్రీనివాస్‌యాదవ్ శంకర్‌యాదవ్ మృతి చెందడంతో సోమవారం వెంకట్‌రెడ్డి శ్రీనివాస్‌యాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్ తదితరులున్నారు.

పదవీ విరమణ.. సత్కారం



మహ్మద్ మున్నీర్‌ను సత్కరిస్తున్న డీఈ కమల్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పదవీవిరమణ ఉద్యోగానికే, వయస్సుకు కాదని ఆజామాబాద్ డీఈ కమల్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీజీఎస్పీడీఎస్ఎల్‌లో పనిచేస్తున్న ఫోర్‌మెన్ మహ్మద్ మున్నీర్ పదవీవిరమణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ అనంతరం తన సమయాన్ని కుటుంబానికి కేటాయించడంతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. ఏఈలు రాము, అంజన్, 1104 యూనియన్ నాయకులు అంజిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, జీఎం ప్రభాకర్, గణేష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

లిబర్టీ: తెలంగాణ ఉద్యమకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పలు సంఘాలు తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. లిబర్టీ ప్లాజాలోని జన సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం అధ్యక్షుడు కె.వెంకటనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వమించారు. తెలంగాణ అమర వీరుల సాధన సమితి నాయకుడు మురళీధర్ దేశ్‌పాండే 1969 వేదిక నాయకులు ఏ.యాదగిరి, ఎమ్మెస్ కృష్ణ 1969 ఉద్యమకారుల సమితి నాయకులు ఎమ్మెస్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. 1969 నుంచి 2024 వరకు సాగిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. బాధిత ఇంటికి ఉద్యోగం ఇవ్వాలని, రూ. 10 వేల పెన్షన్ చెల్లించాలని, ఉచితంగా వసతి కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు.

సన్మానం

హిమాయత్‌నగర్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఇటీవల ఎన్నికైన సీనియర్ ఫొటో జర్నలిస్టు అనిల్‌ను బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో పాత్రికేయ బృందం సోమవారం శాలువాతో ఘనంగా సత్కరించింది. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించింది. టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు దేశపాక స్వామి, పుండరీ చారి, సీనియర్ జర్నలిస్టులు పాండురంగారావు, వేణుగోపాల్, గణేశ్, వెంకటేష్, సాగర్, దేవేంద్ర ప్రసాద్, రాంబాబు, సత్యం, ఉపేంద్ర, గిరిబాబు ఉన్నారు.

త్వరితగతిన ప్రజా సమస్యలు పరిష్కరించాలి



గోల్నాకలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అలసత్వం ప్రదర్శించకూడదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. సోమవారం గోల్నాక డివిజన్ కమలనగర్, లంక బస్తీల్లో ప్రజా సమస్యలపై పాదయాత్ర చేశారు. పారిశుద్ధ్యం, అంతర్గత రోడ్లు, వీధిలైట్లు వంటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కారించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి మౌలిక సమస్యలు తలెత్తిన తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. వివిధ విభాగాల అధికారులు స్థానిక బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

కార్మిక నేత విశ్వనాథంకు ఘన నివాళి



విశ్వనాథం (ఫైల్)

ముషీరాబాద్: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) నాయకులు ఎల్.విశ్వనాథం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతిపై ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు అనురాధా తీవ్ర సంతాపం ప్రకటించారు. విద్యానగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖమ్మం జిల్లా ఇల్లెందు ప్రాంతంలో అనేక ప్రజా ఉద్యమాలకు నేతృత్వం వహించిన విశ్వనాథం అనేక అక్రమ కేసులను జైలు జీవితం, చిత్రహింసలకు గురయ్యాడన్నారు. కొత్తగూడెంలో 25 ఏళ్ల పాటు సింగరేణి బొగ్గు గనుల కార్మికుల యూనియన్ నాయకుడిగా పనిచేశారు.

న్యూడెమాక్రసీ సంతాపం...

విశ్వనాథం మృతిపై సీపీఐఎంఎల్ న్యూడెమాక్రసీ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్‌రావు, కె.గోవర్ధన్ తెలిపారు.

గ్రూప్ - 2,3 పోస్టులు పెంచాలని ధర్నా



చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో ధర్నా చేస్తున్న నిరుద్యోగులు

చిక్కడపల్లి: గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచాలని కోరుతూ చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఎస్సీ పోస్టులను పెంచాలని, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోటీ పరీక్షల మధ్య సమయాన్ని పెంచాలని కోరారు. సిలబస్ పెంచి సమయాన్ని ఇవ్వకపోవడంతో అభ్యర్థులు పరీక్ష రాయలేకపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగపోస్టులను పెంచి పోటీ పరీక్షల మధ్య సమయాన్ని పెంచాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రూప్-2,3 పోస్టులను పెంచి , మెగా డీస్సీని 25వేల పోస్టులు పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సుంకరి ఆనంద్‌కు పురస్కారం



ఉగాది కీర్తిరత్న పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఫెడరేషన్ ఆఫ్ ఎన్ఆర్ఐ కల్చరల్ అసోసియేషన్(ఎఫ్ఎన్‌సీఏ) ఆధ్వర్యంలో మలేషియా అంతర్జాతీయ వేదికపై నిర్వహించిన ఉగాది కీర్తి రత్న పురస్కారాన్ని 2024ను ప్రముఖ సామాజికవేత్త సుంకరి ఆనందర్‌కు అందజేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. అనాథలైన మానసిక వికలాంగులను గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించి సేవలు అందిస్తున్నందుకు ఈ పురస్కారాన్ని అందజేశారని తెలిపారు. దాతల సహకారంతో అనాథ పిల్లలకు అండగా ఉంటూ.. నిరంతరం ఉచితంగా వివాహ వేదికలను కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు. సేవలను గుర్తించి పురస్కారాన్ని అందజేసిన నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా అధ్యక్షుడు డాక్టర్ వెంకటప్రతాప్, జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ కౌసల్య జువ్వల్, టీఏఎం పూర్వ అధ్యక్షులు డాక్టర్ అశోక్‌కుమార్‌రావు, ఉపాధ్యక్షులు భూరెడ్డి మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

డీఎస్సీని వాయిదా వేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: డీఎస్సీ పరీక్షను వాయిదా వేసి ఖాళీల సంఖ్యను పెంచాలని తెలంగాణ రీసెర్చ్ స్కాలర్స్ అధ్యక్షులు డాక్టర్ ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. తొలిసారి వెలువడిన డీఎస్సీకి వందలాది మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారని చదవడానికి సమయం సరిపోనందున పరీక్షను వాయిదా వేయాలన్నారు.

నేడు, రేపు జాబ్‌మేళా

కాచిగూడ: భారత్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 2, 3 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు పంజాగుట్ట, ద్వారకపురి కాలనీలోని సంస్థ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులు. ఫిమేల్ టెలీకాలర్స్, ఎడ్యుకేషన్ కౌన్సెలర్స్, రిసెప్షనిస్టులు, ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కౌన్సిలర్లు, మార్కెటింగ్ మేనేజర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ తదితర పోస్టుల కోసం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9959363083.

డాక్టరేట్ ప్రదానం



వి.చక్రవర్తి

కాచిగూడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి వాణిజ్యశాస్త్రంలో న్యూబోయిన్‌పల్లికి చెందిన వి.చక్రవర్తి సోమవారం డాక్టరేట్ (పీహెచ్‌డీ) డిగ్రీని అందుకున్నారు. 'ఇన్‌స్టిట్యూషనల్ అగ్రికల్చరల్ క్రెడిట్ ఇన్ తెలంగాణ : ఏ కేస్ స్టడీ ఆఫ్ ద డీసీసీబీ, మహబూబ్‌నగర్' 2014–15 నుంచి 2022–23 వరకు 9 ఏళ్లలో అనే అంశంపై పరిశోధన చేశారు. డీసీసీబీ మహబూబ్‌నగర్ పనితీరు, స్వల్పకాలిక, మధ్యకాలిక, ఇతర సంస్థాగత క్రెడిట్ అవసరాలను కలిగి ఉన్న జిల్లాలోని బ్యాంకు సభ్యుల (రైతులు) అవసరాలను బ్యాంకు ఉత్తమంగా తీర్చిందని చక్రవర్తి పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ ఆనంద్ పవార్ పర్యవేక్షణలో చక్రవర్తి పరిశోధన చేశారు. వాణిజ్యశాస్త్రంలో పీహెచ్‌డీ డిగ్రీని అందుకున్న సందర్భంగా విశ్వవిద్యాలయంలోని అధికారులు, సిబ్బంది, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు ఆయనను అభినందించి సత్కరించారు.

పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలి



కవాడిగూడ: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలని బీజేపీ సీనియర్ నాయకులు తొలుపునూరి రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల సందర్భంగా సోమవారం (ఏక్‌పేడు మాకానామ్) 'అమ్మపేరిట ఒక మొక్క' ప్రధాని పిలుపులో భాగంగా ఆయన తన తల్లితో మొక్కను నాటించాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణీకరణ పేరుతో చెట్లను ఇష్టానుసారంగా నరికివేస్తున్నారని, ఇది సమాజ పూరోవృద్ధికి మంచిది కాదన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను నాటి వాటి పరిరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. మధు కల్యాణ్, తిరుపతి, మధుకుమార్ పాల్గొన్నారు.

రౌడీషీటర్‌కు సీఐ కౌన్సెలింగ్

చిక్కడపల్లి: రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు రావాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏ.సీతయ్య సూచించారు. సోమవారం రాత్రి చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్ శక్తిమహేష్‌కు గొడవలకు వెళ్లకుండా మంచి ప్రవర్తనతో మెలగాలని సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (35) ఉందానగర్ – జూకల్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుడి ఒంటిపై ఎరుపు రంగు టీ షర్టు, నీలి రంగు ట్రాక్ ఫ్యాంటు ఉంది. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి ముందు పార్క్ చేసిన కారు చోరీ

అంబర్‌పేట: ఇంటిముందు పార్క్ చేసిన కారు చోరీకి గురైన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీడీ కాలనీలో నివసించే రత్నవాత్ జంగయ్య (టీఎస్ 11ఏఫ్ఏ 7845) కారును తన ఇంటి ముందు పార్క్ చేశాడు. ఉదయం నిద్రలేచి చూసేసరికి తన ఇంటి ముందు కారు కనబడలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు క్లాస్ 2, 393 బీఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం



ప్రణయశ్రీ (ఫైల్)

నల్లకుంట: బాలిక అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) సెక్షన్ 137 కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. అడ్మిన్ ఎస్సై శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేటు ఉద్యోగి లక్ష్మీదేవి భర్త చనిపోవడంతో పదో తరగతి చదువుతున్న కుమార్తె ప్రణయశ్రీ(14)తో కలిసి న్యూ నల్లకుంట బాయమ్మ లేన్‌లో నివాసం ఉంటోంది. సోమవారం తెల్లవారు జామున 3.20 గంటలకు నిద్ర లేచిన తల్లి ఇంట్లో చూడగా.. కుమార్తె కనిపించలేదు. దీంతో పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. (క్రైం నంబర్ 260/2024) కింద మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా సదరు బాలిక గతనెల 26న అదృశ్యం కాగా.. నెల్లూరులో ఆచూకీ లభ్యమైంది. తిరిగి 3 రోజులకే అదృశ్యమవడం గమనార్హం. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... చంచల్‌గూడ ప్రాంతానికి చెందిన ఎండీ.యూనుస్ (35) లేత్ మిషన్ వర్క్‌షాపులో పనిచేసేవాడు. డబిల్‌పుర రైల్వేస్టేషన్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో రైలు ఢీకొని మృతి..

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా, ఫారూక్‌నగర్ కు చెందిన దస్తగిరి (52) బుక్ బైండర్‌గా పనిచేస్తున్నాడు. ఫలక్‌నుమా – శివరాంపల్లి రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా.. ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.